ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024
5
కర్నూలు

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

# రవాణాకు దండుకుంటున్నారు

## - ఇసుక రవాణా ఛార్జీల్లో అదనపు వసూళ్లు - కొనుగోలుదారులపై భారం - పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**ఉచిత ఇసుక రవాణా కోసం వేలల్లో దండుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన రవాణా ఛార్జీల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో ఇసుక కొనుగోలుదారులపై భారం పడుతోంది. అదనపు వసూళ్ల తతంగం అంతా బహిరంగంగానే సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.**

టిడిపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం ఐదు డీ సిల్టింగ్ పాయింట్ల ద్వారా కొనుగోలుదారులకు ఇసుకను అందిస్తున్నారు. సి.బెళగల్ మండలంలోని కె.సింగవరం, ముడుమాల, ఈర్లదిన్నె, కొత్తకోట, గుండ్రేవులలో ఇసుక డీ సిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఇసుక రవాణా సాగుతోంది. తొలుత టన్ను ఇసుక ధరను రూ.326గా నిర్ణయించారు. తవ్వకాలు, లోడింగ్ ఛార్జీల కోసం రూ.168, సీనరేజ్, రాయల్టీ ఛార్జీ రూ.88, జిఎస్‌టి రూ.70 కలిపి టన్నుకు రూ.326 వసూలు చేసేవారు. తాజాగా జిఎస్‌టిలో రూ.6 మినహాయించడంతో టన్ను ఇసుక ధర రూ.320కు చేరింది. ఆ ధరతో పాటు రవాణా కోసం కొనుగోలుదారులు రవాణా ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల వరకు 4.5 టన్నుల ఇసుక పట్టే ట్రాక్టర్కు రూ.1400, 10 టన్నుల ఇసుక పట్టే ఆరు టైర్లు ఉన్న లారీకి రూ.2 వేలు, 18 టన్నుల ఇసుక పట్టే 10 టైర్లు ఉన్న లారీకి రూ.3,600, 22 టన్నుల ఇసుక పట్టే 12 టైర్లు ఉన్న లారీకి రూ.3,840, 31 టన్నుల ఇసుక పట్టే 16 టైర్లు ఉన్న లారీకి రూ.4,480 చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్లు దాటితే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ధర, రవాణా ఛార్జీ వివరాలు తెలిసేలా ఇసుక డీ సిల్టింగ్ పాయింట్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇసుకను రవాణా చేసే వాహనాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీల కన్నా అదనంగా రవాణా ఛార్జీని వసూలు చేస్తున్నారు. 20 కిలోమీటర్ల లోపు ఇసుక రవాణాకు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీ రూ.1400 ఉండగా ఇసుక డీ సిల్టింగ్ పాయింట్ నుంచి 20 కిలోమీటర్ల లోపు ఉన్న సి.బెళగల్ మండల కేంద్రానికి రూ.1900 నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నారు. 4.5 టన్నుల ఇసుక పట్టే ట్రాక్టర్కు ఇసుక కోసం రూ.1440, రవాణా ఛార్జీ కోసం రూ.1400 చొప్పున ట్రాక్టర్ ఇసుకకు మొత్తం రూ.2840 మాత్రమే కొనుగోలుదారుడు చెల్లించాల్సి ఉండగా రవాణా ఛార్జీ పేరుతో అదనంగా వసూలు చేస్తుండటంతో రూ.3340 నుంచి రూ.3500 వరకూ వసూలు చేస్తున్నారు. 20 కిలోమీటర్ల లోపు ఇసుక రవాణా కోసం లారీకు అయితే ఏకంగా రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం 20 కిలోమీటర్లు దాటితే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉండగా ఇసుక రవాణా వాహనాల యజమానులు ఇష్టానుసారంగా రవాణా ఛార్జీలను వసూలు చేస్తున్నారు. దీంతో ఇసుక కొనుగోలుదారులపై రవాణా ఛార్జీల అదనపు భారం పడుతోంది. రవాణా ఛార్జీల అదనపు వసూళ్ల తతంగం అంతా బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సింగవరం వద్ద లారీల్లోకి నింపుతున్న ఇసుక

## ఓటరు నమోదుకు అవకాశం : కలెక్టర్

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరి రివిజన్ -2025 అంశం పై ఇఆర్‌ఒలు, ఎఈఆర్‌ఒలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు.. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ (ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025) లో భాగంగా ఆగస్టు 20వ తేది నుండి అక్టోబర్ 18 వ తేది వరకు ప్రీ రివిజన్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా బూత్ లెవెల్ అధికారుల ద్వారా ఇంటింటి సర్వే, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫోటోగ్రాఫిక్, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను తీసివేయడం వంటి ప్రక్రియలు జరుగుతున్నాయన్నారు. ఇంటింటి సర్వే ప్రక్రియ 99 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 29న నాటికి డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురిస్తామన్నారు. డ్రాఫ్ట్ రోల్ కి సంబంధించి క్లెయిమ్స్ ,అబ్జెక్షన్స్ ఏమైనా ఉంటే అక్టోబర్ 29 నుండి నవంబర్ 28వ తేది వరకు సమయం ఉంటుందన్నారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్లకు సంబంధించి ఇప్పటివరకు 6,199 పెండింగ్ లో ఉన్నాయని, కర్నూలు నియోజకవర్గంలో 1774, ఆదోని నియోజకవర్గంలో 1128, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 582, పాణ్యం నియోజకవర్గంలో 599, మంత్రాలయం నియోజకవర్గంలో 365, ఆలూరు నియోజకవర్గంలో 522, పత్తికొండ నియోజకవర్గంలో 651, కోడుమూరు నియోజకవర్గంలో 578 పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదోని సబ్ కలెక్టర్‌తో పాటు కర్నూలు పత్తికొండ ఆర్‌డిఒలు, అన్ని నియోజకవర్గాల ఏఆర్‌ఒలు పాల్గొన్నారు.

## పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

**- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య**

**ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్**

పర్యాటక రంగంలో యువతకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫంక్షన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ , జిల్లా పర్యాటక అధికారి విజయ, పర్యాటక శాఖ డివిఎం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యువత కూడా పర్యాటకం పట్ల ఎక్కువ ఆసక్తితో ఉన్నారని, అందుకు కళాశాలలు కూడా డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యాటక పరంగా కూడా జిల్లాను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా కార్యక్రమానికి హాజరైన అతిథులను శాలువతో టూరిజం అధికారి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేసిన విద్యార్థినిలకు బహుమతులు ప్రదానం చేశారు .సమావేశంలో కెవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దేవిక, రచయిత్రి వరలక్ష్మమ్మ, స్వతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప తనయుడు సర్దార్ బుచ్చిబాబు, టిజివి కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, విద్యార్థినిలు, కెవిఆర్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌లో సమస్యకు
## మంత్రి భరత్‌కు సంబంధం లేదు

**- అసత్య ప్రచారాలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు**
**- మంత్రి గురించి మార్కెట్ అధికారులు మాట్లాడినట్లు ఆధారాలు ఉంటే చర్యలు**
**- మార్కెట్ యార్డ్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి**

**ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో విత్తన శుద్ధిచేసే గోడౌన్ యజమానిని బెదిరిస్తూ మంత్రి టిజి భరత్ వచ్చి తాళం వేస్తారు అనే బెదిరింపు మాటలకు మంత్రికి ఎలాంటి సంబంధం లేదని మార్కెట్ అధికారులు అలాంటి మాటలు మాట్లాడినట్లు రుజువైతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ ఆమె కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజుల కిందట కాటాదారులు సఫా విత్తన శుద్ధి గోడౌన్ యజమని ఇస్మాయిల్‌తో కలిసి తమకు సమస్యను పరిస్కారం చేయాలని కోరుతూ తమ వద్దకు వచ్చారని, వచ్చి నాలుగు రోజులు మాత్రమే అయిందన్నారు. త్వరలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిస్కారం చేసేలా చూస్తామని చెప్పామన్నారు. అంతే కాని ఈ సమస్యపై మంత్రి భరత్‌పేరు ప్రస్తావన చేయడం సరైంది కాదన్నారు. ఈ ప్రకటనపై విచారణ చేస్తున్నామని నిజానిర్దారణ తెలియగానే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ గోడౌన్‌ను గతేడాది జూన్ లో 5 సంవత్సరాలు లీజు పేరుతో నెలకు రూ.30 వేలు అద్దె చెల్లించేలా తీసుకున్నారని, ఇప్పటిదాకా 15 నెలలు గడిచిందని 3 నెలల అద్దె మాత్రమే చెల్లించారన్నారు. మిగతా ఒక సంవత్సరం అద్దె రూ.3,60000 పెండింగులో ఉందని, ఆ అద్దె కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ అభివృద్ధి పనులు ,పెండింగ్ పనులు, రైతుల సౌకర్యాలు ఏమున్న అన్నిటినీ పరిస్కారం చేసి రాష్టంలోనే గుర్తింపు పొందిన మార్కెట్‌గా కర్నూలు వ్యవసాయ మార్కెట్ పేరు ప్రతిష్టలు పెరిగేలా భవిష్యత్ కార్యాచరణ తయారు చేయమని తమవంతు సహకారం అందిస్తానని మంత్రి భరత్ చెప్పారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరుతో ఇలాంటి అసత్య ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. ఈ అసత్య వార్తల వెనక ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై చట్టపరంగా ముందెకెళ్తామని విచారణ మొదలు పెట్టమని మార్కెట్ అభివృద్ధికి రైతులకు ఎవరు నష్టం చేసినా సహించేది లేదన్నారు.

మాట్లాడుతున్న జయలక్ష్మి

## పదోన్నతులు, బదిలీలు లేవు

**- మున్సిపల్ పాఠశాలలోని ఉపాధ్యాయుల తీరు**
**- యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరుబాట**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

మున్సిపాలిటీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు, నిర్వహించడం లేదు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వినేనాథుడే కరువయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పోరుబాట పట్టారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్, ఆదోని పట్టణాల్లో మున్సిపల్ పాఠశాలలో ఉన్నాయి. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో దాదాపుగా 67 పాఠశాలలు ఉండగా ఇందులో 374 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఆదోని మున్సిపాలిటీలో 38 పాఠశాలలు ఉండగా దాదాపుగా 200 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో మున్సిపాలిటీలో పనిచేసే ఉపాధ్యాయులను మున్సిపల్ శాఖ ద్వారానే పర్యవేక్షణ జరిగేది. ఇప్పుడు ఈ పాఠశాలలు అన్నిటిని విద్యాశాఖ కిందికి గత ప్రభుత్వం తీసుకువచ్చింది. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇప్పటివరకు బదిలీలను కూడా నిర్వహించలేదు. స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులకు సంబంధించి పదోన్నతులను కూడా నిర్వహించలేదు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా తీవ్రంగా నెలకొంది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 35 పాఠశాలల్లో సింగిల్ టీచర్ తోనే బోధన జరుగుతుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులు లేకపోవడంతో కూడా విద్యార్థులకు బోధన సక్రమంగా అందడం లేదు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో కూడా మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా నెలకొన్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. అనేక పాఠశాలల్లో బోదేనేతర సిబ్బంది లేకపోవడంతో కూడా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే అన్ని పనులను చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పిఎఫ్‌కు సంబంధించిన సమస్యకు తీవ్రంగా ఉంది. అనేక సమస్యలతో మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు సతమతమవుతున్న పరిష్కరించకపోవడంతో యుటిఎఫ్ ఉద్యమ బాట పట్టింది. ఈ ఉద్యమానికి కూడా ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారు.

**మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం : యుటిఎఫ్**

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఉద్యమం చేపడుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విద్యాశాఖ అధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ సౌమ్యల్ పాల్ కు యుటిఎఫ్ జిల్లా ప్రతినిధిబృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపడుతున్నామన్నారు. వెంటనే వారికి పదోన్నతులు బదిలీలను చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంతో పాటు పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శులు ఇబ్రహీం ఇతర జిల్లా నాయకులు భాస్కర్ ,సర్వేశ్వర్ రెడ్డి హనుమన్న ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

### బదిలీలు పదోన్నతులు చేపట్టాలి

**- ఇబ్రహీం, యుటిఎఫ్ నగర కార్యదర్శి**

మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులను వెంటనే చేపట్టాలి. అలాగే అనేక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యను తీర్చాలి. నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించి మున్సిపల్ పాఠశాలలో విద్యను మరింత బలోపేతం చేయాలి.

### ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి

**- భాస్కర్, ఉపాధ్యాయుడు**

అనేక మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు బోధన అందడం లేదు. పాఠశాలల్లో వెంటనే ఉపాధ్యాయులను నియమించి తగు చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్ సమస్యను కూడా పరిష్కరించాలి.

## డిటిసి శాంతకుమారి బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

రహదారి భద్రతలు పాటిస్తూ గమ్యస్థానాలకు చేరాలని కర్నూలు నూతన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డిటిసి) ఎస్.శాంత కుమారి తెలిపారు. శుక్రవారం కర్నూలు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు రోడ్డు ప్రమాదాలు జరగకుండా రహదారి భద్రతలు పాటిస్తూ గమ్యస్థానాలకు చేరాలన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శాంత కుమారి 2018 బ్యాచ్ ఐఎఎస్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. మొదటగా కడప, రాయచోటి తదితర ప్రాంతాల్లో పనిచేసి ఏలూరు నుంచి కర్నూలు డిటిసిగా సాధారణ బదిలీల్లో కర్నూలుకు వచ్చారు.

## అదనపు కమిషనర్ బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఆర్‌జివి.కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర మేయర్ బివై. రామయ్యను ఆయన ఛాంబర్‌లో కలిశారు. మేయర్‌ను ఎస్ఇ జి.రాజశేఖర్, ఎంఇ సత్యనారాయణ, డిఇఇ మనోహర్ రెడ్డి కలిశారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ ఇశ్రాయోలు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎపి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ఎపి స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నూతన డైరెక్టర్‌గా కర్నూలు జిల్లా నుంచి కొంకతి లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిక్కారెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన 2013 నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం కూడా ప్రయత్నించారు. పార్టీ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా కైపపద్మలత

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

కర్నూలు 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి ఎపి స్టేట్ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని దక్కించు కున్నారు. ఈ మేరకు జిల్లా టిడిపిఅధ్యక్షులు పి.తిక్కారెడ్డి ఆమెను శాలువాతోసన్మానించి అభినం దించారు. పార్టీ అభివద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పార్టీ తనపై విశ్వాసం ఉంచి పదవిని అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తన అభివృద్ధికి పాటుపడిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

**ఎస్‌పి జి.బిందు మాధవ్**
**అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

జిల్లాలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్) పై కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ..మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాల, కళాశాలల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రైల్వే స్టేషన్లు , ఆర్టీసీ బస్టాండ్లు, పంట పొలాల్లో, గ్రామీణ అటవీ ప్రాంతాల్లో కూడా అన్ని శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. అన్ని విద్యా కేంద్రాల్లోనూ, సంక్షేమ హాస్టల్లోనూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల ఉత్పత్తిని, వాడకాన్ని గమనిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పోలీసులకు సంబంధిత శాఖల వారికి సమాచారం అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలను కొనడం , అమ్మకం చేస్తూ , అక్రమ రవాణా కు పాల్పడేవారి పై పోలీసు నిఘా పెంచామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం చాలా అవసరమన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు తెలపాలన్నారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ శాంతకుమారి, జాయింట్ డెరెక్టర్ అగ్రికల్చర్ వరలక్ష్మి, ఫారెస్ట్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ విజయ్ కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ నాగప్రసాద్, జిల్లా విద్యా శాఖ అధికారి శా మ్యూల్, ఆర్‌టిసి డిపో మేనేజర్ ఇంచార్జ్ సుధారాణి , డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కైకా , గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ ఎంఒ కిరణ్ కుమార్ , డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్‌బాబు , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ పెన్షన్ కనీసం రూ.9 వేలివ్వాలి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం 1995 (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ క్యాటగిరి) కి సంబంధించిన పెన్షనర్లు , ఫ్యామిలీ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డిఒటి పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.మద్దిలేటి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్–డిఒటి పెన్షనర్స్ అసోసియేషన్, కర్నూలు జిల్లా శాఖ, కర్నూలు వారు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు కర్నూలు అశోక్ నగర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ హోషియార్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు కనీసం రూ.7500 అయినా పెన్షన్‌గా ఇవ్వాలని, దాంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. వారికి డిఎ, హెల్త్ కార్డులు ఇవ్వాలని ఎఐబిడిపిఎ గాడిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ ఎస్.ఖాజా మొయిద్దీన్ , పి.అబ్దుల్ సుభాన్, రిటైర్డ్ టిటిఎ పాల్గొన్నారు. విశ్రాంత ఆర్‌టిసి డిపో మేనేజర్ పి. దస్తగిరి, ఇతర ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు.

## బురద చల్లే అవసరం మాకు లేదు

**తప్పు చేసి ప్రజలకు దూరమయ్యారు-జగన్‌పై తిక్కారెడ్డి విమర్శ**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రాష్ట్ర సాధారణ ఎన్నికల్లో 164 సీట్ల మెజారిటీతో గెలిచిన తమకు జగన్మోహన్ రెడ్డి పై బురద జల్లే అవసరం తమ పార్టీ అధినేతకు లేదని కర్నూలు టిడిపి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేసిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయినా ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.4000 పెన్షన్, అన్న క్యాంటీన్లు, ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తారీఖున జీతాలు చెల్లిస్తున్నామన్నారు. నిరంతర శ్రామికుడు చంద్రబాబు నాయుడని వరదల్లో అహర్నిశలు ప్రజలతో ఉండి ఆదుకున్న ఆపద్బాంధవుడని అన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని, నేడు తమ ప్రభుత్వంలో మహిళలకు భద్రత పెంచి భరోసాగా కల్పించామన్నారు. దీపావళి నాటికి ఉచిత సిలిండర్ అందజేస్తామన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న వేదవతి, ఆర్‌డిఎస్, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి నియోజకవర్గంలో తాగు, సాగు నీరు అందిస్తామన్నారు. డబుల్ రోడ్లకు కృషి చేస్తామన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, సమస్యలపై ప్రత్యేక నివేదికను రూపొందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాణ్యమైన కరెంటును అందిస్తున్నామన్నారు. హిందువులకు శ్రీ వెంకటేశ్వర స్వామి, ముస్లింలకు మక్కా ,క్రైస్తవులకు వాటికన్ సిటీ అత్యంత పవిత్రమైన స్థలాలు అన్నారు. అక్రమ సంపాదనకు కక్కుర్తిపడి గతపాలకులు తిరుపతి లడ్డు కల్తీకి పాల్పడ్డారన్నారు. చివరికి ఇదేమని అడిగిన ప్రభుత్వం పైనే ఎదురుదాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. వైసిపి నేత తనపై బురద చల్లుతున్నారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సెక్రటేరియట్లో జగన్మోహన్ రెడ్డి ఏనాడు కాలు పెట్టలేదని, కుర్చీలు, బల్లలు బూజు పట్టాయని అన్నారు. అందుకే ప్రజలు ఆయనను దూరం పెట్టారన్నారు. 164 సీట్లతో గెలుపొందిన మాకు బురద చల్లాల్సిన అవసరం లేదన్నారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, దానికి తగిన ఫలితం అనుభవించక తప్పదని అన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వీరభద్ర గౌడ్ మాట్లాడారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు సోమిశెట్టి నవీన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణ, కాసాని మహేష్‌గౌడ్, ఎస్సీసెల్‌అధ్యక్షులు జేమ్స్, నాయకులుతిరుపాలు, హనుమంతరాయ చౌదరి పద్మలతారెడ్డి పాల్గొన్నారు.

## ఇఎన్‌టి విభాగంలో ఎండోస్కోపీ యూనిట్ ప్రారంభం

**-రూ30 లక్షలు విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్ విరాళం**
**-దాతలకు కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇఎన్‌టి విభాగంలో ఎండోస్కోపీ యూనిట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అమెరికాలోని చికాగోలో నివసించే 1962 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి, 1963 బ్యాచ్ కు చెందిన అరుణ దంపతులు తమ మాతృమూర్తి పెన్నబడి గంగులమ్మ జ్ఞాపకార్థం రూ 30 లక్షల విలువైన వివిధ మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి విరాళంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా రూ 4.5 లక్షల విలువైన ఇఎన్‌టి డిపార్టుమెంటల్ ఎఫ్ఇఎస్ ఎస్ సైనస్ ఎండోస్కోపీ చేసే టోటల్ ఎండోస్కోపీ యూనిట్‌ను ఆ డిపార్టుమెంట్ హెచ్ఒడికి అందజేశారు. విరాళం ఇచ్చిన వైద్యులకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు. ఇఎన్‌టి హెచ్ఒడి డాక్టర్ వీరకుమార్, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, ఇఎన్‌టి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, ఇన్ఎన్‌టి విభాగపు పీజీలు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంలోపించకుండా ప్రత్యేక శ్రద్ధ

**కర్నూలు కార్పొరేషన్ :** నగర వ్యాప్తంగా కాలనీల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్, కోట్ల విజయభాస్కరరెడ్డి ఘాట్‌లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆరోగ్యధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్ బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మద్దికెర విద్యార్థి

**ప్రజాశక్తి-మద్దికేర**



మద్దికెరలోని విద్యాసాయి జూనియర్ కళాశాల విద్యార్థి కాలువ యువరాజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వెంకట మాధవ్ తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేర విద్యాసాయి కళాశాలలో కాలువ యువరాజ్ ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్నట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్కూలులో క్రికెట్ ప్రాక్టీస్ చేసి గత సంవత్సరంలో రాష్ట్రస్థాయి అండర్ 16 క్రికెట్ పోటీల్లో పాల్గొనారన్నారు. ప్రస్తుతం సంవత్సరంలో కూడా మళ్లీ రాష్ట్రస్థాయి అండర్ 19 క్రికెట్ పోటీల్లో ఎంపికైనందున కళాశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా తమ ప్రతిభను చాటాలని సూచిస్తూ, ఉపాధ్యాయుల కృషి వల్లే యువరాజు ఆ స్థాయికి ఎదిగాడని తెలిపారు.

## ప్లాస్టిక్ వాడకం నిషేధం : కమిషనర్

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కమిషనర్ కృష్ణ

ప్లాస్టిక్ వాడకం నిషేధమని, నిబంధనను అతిక్రమించి విక్రయించిన వారిపై కేసులు నమోదు చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం రాంజల చెరువు వద్ద స్వచ్ఛత హి సేవాలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి వరకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. చెత్తాచెదారాన్ని మురుగు కాలువలో వేయకుండా డస్ట్ బిన్లను ఉపయోగించి, పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు.

**ఎమ్మిగనూరు :** పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ దగ్గర సాయిబాబా దేవాయలం, ఆదోని బైపాస్ రోడ్డులోని సాయిబాబా దేవాలయం దగ్గర శుభ్రం చేయించి, పరిసరాల్లో బ్లీచింగ్ వేయించారు. మున్సిపల్ డిఇఇ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. మెప్మా డిపార్ట్‌మెంట్ నుంచి జయవర్ధన్ పాల్గొన్నారు.

**అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్**

పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. క్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని తనిఖీ చేశారు.

## గ్రంథాలయాలతో జ్ఞానం : ఎమ్మెల్యే

**- రూ.28 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభం**

**ప్రజాశక్తి - చిప్పగిరి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

జ్ఞాన సంపద పెరగాలంటే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలో గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో సర్పంచి దాసరి గోవిందరాజులు అధ్యక్షతన రూ.28 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత, సర్పంచి గోవిందరాజులు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే గ్రంథాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రంథాలయాలు విద్యార్థులకు, నిరుద్యోగులకు తప్పనిసరిగా అవసరం పడతాయని తెలిపారు. గ్రంథాలయాల్లో కొన్ని సంవత్సరాల క్రితం చరిత్ర గల పుస్తకాలు ఉంటాయన్నారు. వాటి వల్ల కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఇంటి దగ్గర కాలక్షేపం చేసే కంటే ఒక గంట పాటు గ్రంథాలయాలకు వెళ్లి తోచిన పుస్తకం చదవాలని సూచించారు. ప్రజలందరికీ అందుబాటులో గ్రంథాలయ కార్యాలయం ఉండడం అదృష్టకరమని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, బెల్డోన సొసైటీ మాజీ అధ్యక్షులు మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, విఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు రామాంజనేయులు, చిప్పగిరి ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, వైసిపి నాయకులు నాగప్ప, లోకనాథ్, సేనాపతి, నాగేంద్ర, ఈరప్ప, ధర్మేంద్ర, ఎంఇఒలు సావిత్రమ్మ, లతీఫ్, గ్రంథాలయ అధికారులు విజయ్ కుమార్, మురళీధర్, కృష్ణారెడ్డి, బషీర్ అహ్మద్, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు, రాముకుమార్ పాల్గొన్నారు.

## ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**- 30న చలో కలెక్టర్‌ను జయప్రదం చేయండి**

**- సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

చలో కలెక్టరేట్ కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులతో కలిసి చలో కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చాయని, వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఈఎస్ఐ సౌకర్యం, డిఎ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 30న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని తెలిపారు. సురేష్, జయపాల్, శీను, హనుమన్న, నరసింహులు, వీరేష్, గోపాల్, రంగన్న, గోపాల్, వెంకటేష్, ఈరన్న పాల్గొన్నారు.

### దళిత మహిళపై దాష్టీకం

## రాజకీయ పక్షాలకు పట్టదా..?

**- సబ్ కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలి**

**- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు**

**ప్రజాశక్తి - ఆదోని**

మాదిగ గోవిందమ్మపై కుల దురహంకారులు జరిపిన దాష్టీకం రాజకీయ పక్షాలకు పట్టడం లేదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు మండిపడ్డారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, ఐద్వా జిల్లా నాయకులు కె.వెంకటమ్మ, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మణ్, కెజిబిఎస్ జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్, దళిత మహిళా సంఘం జిల్లా నాయకులు డి.విజయమ్మ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు సుమాల రాజు మాట్లాడారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో మాదిగ గోవిందమ్మపై దాడి జరిగి 15 రోజులు గడిచిందని తెలిపారు. దీనిపై రాజకీయ పక్షాలు నోరు తెరవకపోవడం దళితుల పట్ల వారికున్న అంకితభావం అర్థమవుతోందని విమర్శించారు. ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో వివక్ష ఎక్కువగా ఉందని, రాజకీయ, ఆధిపత్య ఒత్తిడికి తలొగ్గిన ఆదోని రెవెన్యూ డివిజన్ అధికారులంతా అంటరానితనాన్ని రూపుమాపడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రస్తుతం సబ్ కలెక్టర్‌గా ఐఎఎస్ అధికారిని కేటాయించినా దళితులపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో లోపం కొనసాగుతూనే ఉందన్నారు. ఈనెల 12న దళిత గోవిందమ్మను బట్టలూడదీసి, విద్యుత్ స్తంభానికి కట్టి, అసభ్యంగా ప్రవర్తించి, విచక్షణారహితంగా కొట్టిన ఘటనలో కారకులందరిపై కేసు నమోదు చేయడానికి పోలీసులకు ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. గోవిందమ్మ చెప్పిన 30 మంది నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో పాటు బిఎన్ఎస్ 109, అట్రాసిటీ యాక్ట్ 3(1)(వై)ను కూడా చేర్చాలని కోరారు. ఘటన జరిగిందని తెలిసిన వెంటనే వెళ్లాల్సిన తహశీల్దార్ ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. బాధిత మహిళ అందుబాటులో ఉన్నా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 17 గంటలు ఆలస్యమైందని తెలిపారు. ఈ విషయాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకపోతే 'చలో కల్లుకుంట' చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్.చిన్న మారయ్య, ఎమ్మిగనూరు, ఆదోని మండల అధ్యక్షులు సప్పోగు తిమ్మన్న, మునిస్వామి, మంత్రాలయం, కోసిగి మండల కార్యదర్శులు గర్జి అంజి, రామకోటి హనుమంతు, నాయకులు పరమేష్, తాయన్న, వీరేష్, మహారాజ్, రాముడు, గుంటెప్ప, సురేష్, మారెప్ప, ఆశీర్వాదం, చార్లెస్, సోమన్న, హనుమన్న, ఫిలిప్ పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న ఆనందబాబు

## ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - ఆస్పరి**

కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అరుణ్ కుమార్ బదిలీపై శుక్రవారం ఆస్పరి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జగదీష్ వర్మ కొద్ది రోజుల క్రితం సస్పెన్షన్ అయినట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ... సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొలం, లేఅవుట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్లు చేస్తామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కెజిబివి విద్యార్థిని

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం కెజిబివిలో 8వ తరగతి చదువుతున్న జి.స్వాతి రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. ఈనెల 26న జరిగిన జిల్లాస్థాయి లాంగ్ జంప్ పోటీల్లో స్వాతి ప్రతిభ కనబరిచి నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని స్వాతిని ఆమె అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి విజయం సాధించి కస్తూరిబా పాఠశాలకు, మండలానికి, విద్యార్థిని సొంత గ్రామం ముగతికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని పిఇటి శిరోమణి అభినందించారు.

సంజనను అభినందిస్తున్న విట్టా రమేష్

## క్రీడా ప్రదర్శనకు టోర్నమెంట్

**- క్రికెట్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు రమేష్**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలో క్రీడా ఆసక్తి ఉన్న వారి కోసం, వారి ప్రతిభను ప్రదర్శించుకునేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తామని క్రికెట్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు విట్టా రమేష్ తెలిపారు. రాష్ట్ర క్రికెట్ ప్రాబబుల్ అండర్-15 మ్యాచ్‌లకు ఎంపికైన ఆదోని అమ్మాయి, కిడ్డీస్ స్కూల్ విద్యార్థిని సంజనను శుక్రవారం వారి కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నేటి నుంచి అక్టోబర్ 1 వరకు జరిగే క్రికెట్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం సంజనకు లభించిందని తెలిపారు. ఆమె ఆల్ రౌండర్ అని చెప్పారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్‌లో రాణిస్తున్నారని, రాష్ట్ర ప్రాబబుల్ మ్యాచ్‌లోను ప్రతిభ చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిభ చూపిన వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి వారి ఎదుగుదలకు దోహదపడతామని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ తాలూకా ఉపాధ్యక్షులు ముజీబ్, కార్యదర్శి వెంకటేష్, కోచ్ బాలాజీ రావు ఉన్నారు.

## ఉన్నపలంగా ఇళ్లు కూలిస్తే ఎలా

**- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్**

**ప్రజాశక్తి - ఆదోని**

దశాబ్ద కాలంగా నివాసమున్న వారి ఇళ్లను ఉన్నపలంగా కూల్చి వేస్తే ఎలా అని, వారికి గడువు ఇవ్వాలని కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా తెలిపారు. శుక్రవారం ఆదోని రాయనగర్, మాధవరం రోడ్ సైడ్ ఉన్న గుడిసెలను మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు కూల్చివేశారు. బాధితులు మాట్లాడుతూ... నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా జెసిబితో కూల్చడం వల్ల సామాన్లు అన్నీ ధ్వంసం అయ్యాయని వాపోయారు. నిత్యావసర సరుకులు, ఇతర సామాన్లు తీసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా ఇంత కఠినంగా వ్యవహరించడం ఏమిటని వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న రమేష్ యాదవ్, దిలీప్ ఢోకా ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలిచారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని కట్టడాలను, నిర్మాణాలను కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. పట్టణంలో అక్రమ కట్టడాలు ఎన్నో ఉన్నాయని, వాటిని వదిలి కాలనీలో నిర్మాణాలు తొలగించడం, పేదలను ఇబ్బందులు గురిచేయడం తగదని నిలదీశారు. కొంత సమయం ఇవ్వాలని, వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మారుతి, దేవిశెట్టి వీరేష్, సాయినాథ్, యువజన కాంగ్రెస్ నాయకులు వినీత్ ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

## ప్రజల కోసం పని చేస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఆదోని**

మార్పు కోసం ప్రజలు ఆదరించి తనకు ఎమ్మెల్యే ఉద్యోగం ఇచ్చారని, వారి ఆశలకు అనుగుణంగానే పని చేస్తామని, విమర్శలను పట్టించుకోమని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం 13వ వార్డు కార్వన్ పేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని టిడిపిలో ఐదు గ్రూపులు ఉన్నాయని, ఎక్కడో ఒక చోట ఆ సంతృప్తి ఉంటుందని తెలిపారు. అసలు వారిని పట్టించుకోవాలంటే ఏం చేయాలో చెప్పాలి కదా అని ప్రశ్నించారు. టిడిపి నాయకులను పట్టించుకోవాలంటే వారు తన ఇంటికి వచ్చి టిఫిన్, భోజనం చేయవచ్చని, ఎన్ని రోజులైనా ఉండవచ్చని చెప్పారు. వారిని తన ఇంట్లో బాగా చూసుకుంటానని, అవసరమైతే తాను వాళ్ల ఇంటికి వెళ్లి టిఫిన్ చేస్తానని తెలిపారు. ఇంతకంటే ఇంకేం చేయాలని చలోక్తులు విసిరారు. ఇంకేమైనా ఉంటే చెప్పాలి కదా.. అనవసరంగా మాట్లాడితే ఎవరికీ ప్రయోజనం ఉండదన్నారు. వారే తనను గెలిపించారని, వారికి ఏం కావాలో చెప్పాలని అన్నారు. తాను టిడిపి, బిజెపి, జనసేన కండువాలేసుకుని తిరుగుతున్నానని, ఇంకేం చేయాలని ప్రశ్నించారు. ఎవరు వచ్చి అడిగినా, పని చేసి పెట్టమంటే వంద శాతం చేసి పెడతానని తెలిపారు. విలేకరుల దగ్గర ఎవరైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే వారిని తన వద్ద పంపించాలని, వారి పని చేసి పంపిస్తానని చెప్పారు. గతంలో ప్రజలు సమస్యలు తెలపడానికి ఎమ్మెల్యే ఇంటి ముందు చేతులు కట్టుకుని గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. తనను విమర్శించే వారు కూడా పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకోవచ్చని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మాజీ కౌన్సిలర్ బాలాజీ ఉన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

**రైతు కడుపు నింపేందుకే**

**ఆదోనిరూరల్ :** మార్కెట్ యార్డుల్లో సరుకు అమ్మకానికి వచ్చే రైతులకు కడుపునిండా అన్నం పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు రాయితీ భోజనాన్ని ఎమ్మెల్యే పార్థసారథి మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదని అన్నక్యాంటీన్లను ప్రారంభించారని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో సైతం రూ.5లకే రైతులకు రాయితీ భోజనం అందిస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డిఇ సుబ్బారెడ్డి, కమీషన్ ఏజెంట్ల సంఘం నాయకులు గుడిసె శ్రీరాములు, పత్తి వ్యాపార సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సోమశేఖర్ గౌడ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతులకు అన్నం వండిస్తున్న ఎమ్మెల్యే


**మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : ఆదోని**

E.P. No. 100/2021 IN O.S.No.42/2020

Between :

సి. విజయభాస్కర్ రెడ్డి S/o సి. శంకర్ రెడ్డి, R/o H.No. L.LG. 2/1, APHB ఆదోని, కర్నూలు జిల్లా. ..... డిక్రీహోల్డర్

V/s.

సి. గాదిలింగ్ @ సి. గాదెప్ప S/o సి. వెంకప్ప R/o నాగనాథనహల్లి గ్రామం, ఆదోని మండలం, కర్నూలు జిల్లా. .... జడ్జిమెంట్ డెబ్టర్

**బహిరంగ వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయ డమేమనగా పై తెలిపిన డిక్రీహోల్డర్ (సి. విజయభాస్కర్ రెడ్డి) డిక్రీ బాకీ బాసరు E.P. అమౌంట్ బాకీ వసూలు నిమిత్తం జడ్జిమెంట్ డెబ్టర్ సి. గాదిలింగ్ @ సి. గాదెప్ప గారికి చెందిన క్రింద కనపరచిన E.P. షెడ్యూలు దాఖల పొలము పై కోర్టు వారు తేది: 28-10-2024 ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపల పై కోర్టు నందు బహిరంగ వేలం వేయబడును. కొనదలచిన వారు బహిరంగ వేలములో పాల్గొన వచ్చును. వివరాలకు కోర్టు రికార్డును గాని లేక డిక్రీ హోల్డర్ వకీలును గాని సంప్రదించవచ్చును.

**షెడ్యూలు**

The land is situated at Naganathanahalli Village, Adoni Mandal within Gram Panchayath area of Naganathanahalli Village within the Sub-Registration District of Adoni and Distict Registration of Kurnool with the following particulars :-

**Sy.No.288/1 with an extent Ac.0.99cents**

Boundaries :-
East : loand of Gajula Pandu;
West : land of Nembi Rangaiah Swamy
North : land of Chakali Lakshmamma W/o Shantaiah;
South : land of Chakali Venkatesu

D.Hr. Value : Rs.50,000/-
J.Dr. Value : Not Given
Amins Value : Rs.1,00,000/-
Encumbrance :- NIL

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

**వాయిదా తేది : 28-10-2024**

**శ్రీ బి.హరిసర్వోత్తమ రెడ్డి,**
డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్,
ఆదోని-518301.
ఫోన్ : 9849314408


## 7 నుంచి దేవరగట్టు బన్నీ ఉత్సవాలు

**ప్రజాశక్తి - హోళగుంద**

మండలంలోని దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వర స్వామి ఉత్సవాలు అక్టోబర్ 7 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. అక్టోబర్ 7న గణపతి పూజ, 12న విజయదశమి బన్ని ఉత్సవం, 13న తెల్లవారు జామున దైవవాణి కార్ణికం, 14న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న గొరవయ్యల నృత్యం, గొలును తెంపుట, వసంతోత్సవాలు, కంకణ విసర్జన ఉంటుందని చెప్పారు. 16న శ్రీమాల మల్లేశ్వర స్వాముల వారు నెరణికి గ్రామానికి చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

## 'చికెన్ షాపును తొలగించాలి'

**ప్రజాశక్తి - హోళగుంద**

మండలంలోని నెరణికి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయానికి సమీపంలో ఉన్న చికెన్ షాపును తొలగించాలని బిజెపి నాయకులు ఈడిగ నరసింహ ప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు చిదానంద, జాంటి వీరేష్ కోరారు. శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందించారు. జగదీష్, పవన్ కుమార్, చంద్ర పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు

**- జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత**

**ప్రజాశక్తి - పెద్దకడుబూరు**

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి బి.హేమలత తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దకడబూరు, హనుమాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో ఎఒ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి శిక్షణ నిర్వహించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త కె.మౌనిక, హేమలత పాల్గొని రైతులకు మిరప, పత్తి, వరి పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత, రాహుల్ కళ్యాణ్, గ్రామ పెద్దలు జగన్నాథ్ రెడ్డి, విజయకుమార్, సుధాకర్ రెడ్డి, ఈరన్న, చంద్రశేఖర్, లోకదాస్ పాల్గొన్నారు.

### విచారణ పేరుతో తప్పుదోవ పట్టిస్తున్న

## ఎంఇఒలను సస్పెన్షన్ చేయాలి

**- దళిత ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల డిమాండ్**

**ప్రజాశక్తి - నందవరం**

విద్యార్థులపై కులవివక్ష చూపిన ప్రధానోపాధ్యాయులు నరేష్‌ను కాపాడాలని విచారణ పేరుతో తప్పుదోవ పట్టిస్తున్న నందవరం ఎంఇఒలను సస్పెన్షన్ చేయాలని దళిత ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పూలచింత గ్రామంలో మూడు వారాల క్రితం ఎస్సీ విద్యార్థులను కులం పేరుతో దూషించిన ప్రధానోపాధ్యాయులు నరేష్, ఉపాధ్యాయులు పవన్‌పై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఎంఇఒలు విచారణ చేసి విద్యార్థులను కులం పేరుతో దూషించారని, మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అన్నం పెట్టే సమయంలో వేర్వేరుగా పెట్టి విద్యార్థుల పట్ల అంటరానితనం పాటించారని, కుల వివక్ష చూపారని నిర్ధారణ చేసి డిఇఒకు నివేదిక పంపారని చెప్పారు. ఈనెల 9న వారిని సస్పెన్షన్ చేసినట్లు డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రెండు రోజుల తర్వాత సస్పెన్షన్ అయిన ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు వచ్చారని చెప్పారు. విద్యార్థి, దళిత ప్రజాసంఘాలు ఆందోళన చేయడంతో మళ్లీ విచారణ కమిటీ వేస్తున్నట్లు ప్రకటించి, రెండుసార్లు డిప్యూటీ డిఇఒ వస్తారని చెప్పి ఎంఇఒ అందరికీ నోటీసులను వాట్సప్ ద్వారా జారీ చేసి వాయిదాలు వేశారని అన్నారు. ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు. కలెక్టర్, ఆర్‌జెడి, డిఇఒ స్పందించి ఎంఇఒలను, సస్పెన్షన్ అయిన ప్రధానోపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా నాయకులు ఎసి.దేవదానం, నాయకులు ఎద్దుల చెన్నయ్య, పిఎస్‌యు జిల్లా నాయకులు బి.సురేష్, నాయకులు రఘునాథ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఎం.నరసప్ప పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి, దళిత ప్రజా సంఘాల నాయకులు

## భవిష్యత్తు ప్రణాళికతో ముందుకెళ్లాలి

**- డీఎస్పీ ఉపేంద్ర బాబు**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడేతత్వంతో భవిష్యత్తు ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే బాలబాలికలు పాఠశాల స్థాయి నుంచే కష్టపడే తత్వం అలవరచుకోవాలని తెలిపారు. సమాజంపై సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణ కలిగి ఉండి గురువులను గౌరవిస్తూ, తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సహాయపడుతూ సమాజంలో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని తెలిపారు. గోనెగండ్ల సిఐ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం పాల్గొన్నారు.

## లడ్డులో కల్తీ నెయ్యి వాడకం దుర్మార్గం : జనసేన

**ప్రజాశక్తి - మంత్రాలయం**

తిరుపతి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకం దుర్మార్గపు చర్య అని జనసేన ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న విమర్శించారు. శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా లక్ష్మన్న ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుపతి లడ్డు తయారీలో ఆవు నెయ్యికి బదులు కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు కలపడం బాధాకరమని తెలిపారు. జనసేన నాయకులు బదినేహాల్ చిన్న, లోకేష్, రవిచంద్ర, రామకృష్ణ, నరసింహులు, బజారి, సుభాన్, గౌస్ బాషా, అంజి, రాకేష్ పాల్గొన్నారు.

దీక్షల్లో మాట్లాడుతున్న నాయకులు

## శనగ విత్తనాలు రాయితీ కింద ఇవ్వాలి : ప్రజాసంఘాలు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

రైతులకు రాయితీ కింద శనగ విత్తనాలు పంపిణీ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎఒ జీరా గణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవపుత్ర రాజు మాట్లాడారు. మండలంలో విస్తారంగా వర్షాలు పడడంతో పత్తికి ఎర్ర తెగులు సోకి దిగుబడి రాకపోవడంతో పత్తి చేను దున్నుకొని రైతులు సబ్సిడీ శనగలు విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణమే రైతులకు శనగ విత్తనాలు సబ్సిడీ ద్వారా అందించాలని కోరారు.

## క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యనందించాలి : ఎంఇఒ

**ప్రజాశక్తి - నందవరం**

విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మంచి గుణాత్మక విద్యనందించాలని ఎంఇఒ సుదర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లోని పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు తిని పరిశీలించారు. కొట్టాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుకర్, ఉపాధ్యాయులు మాణిక్యం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

పెద్దకడబూరులో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి మదర్ థెరిస్సా ఫౌండేషన్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు బొగ్గుల పరమేష్ తరపున బొగ్గుల అర్లప్ప బాధిత కుటుంబ యజమాని మంచోది శాంతిరాజుకు నగదు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముక్కరన్న, సరసన్న, రాజు పాల్గొన్నారు.

### కౌతాళానికి 100 పడకల ఆస్పత్రి

## మంజూరు చేయిస్తాం : పురుషోత్తం రెడ్డి

**ప్రజాశక్తి - కౌతాళం**

కౌతాళం మండలానికి 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయిస్తామని హైకోర్టు సీనియర్ అడ్వకేట్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అక్కమ్మ తోటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చాక 100 రోజుల్లోనే ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. నాయకులు రామాంజనేయులు, ఈరన్న, బదినేహాల్ ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పురుషోత్తం రెడ్డి


**మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

ఐ.ఎ.నెం.538/23 ఓ.ఎస్.నెం.290/2023

టి.చైతన్య. ...అర్జీదారు

V/s

**D.No.1**

T. శాంతికుమారి
W/o Late T. శ్రీనివాసులు
R/o ఎన్.వెంకటపురం (గ్రా),
వెల్దుర్తి (మండలం), కర్నూలు జిల్లా. ...రెస్పాండెంట్

**నోటీసు**

సదరు నెంబరు అర్జిదారు మీపై ఇంజక్షన్ కోరి దావా మెషన్ దాఖలు చేసి యుండెటందున ఈ విషయమై మీకు ఆక్షేపణనున్న ఎడల 04/10/2024 తేదిన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దునగాని వకీలు ద్వారా గాని ఈ కోర్టులో మీరు హాజరై పై కోర్టువారితో మనవి చేసుకోవలసినది లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదరని తెలియజేయడమైనది.

కోర్టువారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేది : 04/10/2024

జి.శేషశయనరావు,
యం.శ్రీనివాసులు,
అర్జీదారు పరం న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440336016



**మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

ఓ.ఎస్.నెం.290/2023

టి.చైతన్య. ...వాది

V/s

**D.No.1**

T. శాంతికుమారి
W/o T. శ్రీనివాసులు
R/o ఎన్.వెంకటపురం (గ్రా),
వెల్దుర్తి (మండలం), కర్నూలు జిల్లా. ...ప్రతివాది

**దావా సమను**

పై నెంబరు దావాలోని వాది పై ప్రతివాది అయిన మీపై ఇంజక్షన్ కోరు నిమిత్తము గాను దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా 4/10/2024వ తేదిన ఉదయం 10.30 గం॥లకు మీరు గాని మీ తరపును వకీలు గారు గాని హాజరై పై కోర్టు నందు ఆక్షేపణలు తెలియజేసుకొనవచ్చును. లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

కోర్టువారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేది : 4/10/2024

జి.శేషశయనరావు,
యం.శ్రీనివాసులు,
వాదిపరం న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440336016



**మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు అట్ ఆదోని**

I.A. No. 53/2023 IN A.S.No. /2023

Between :

బి. భూపాల్ రెడ్డి ..... పిటీషనర్ అప్పిలెంట్

V/s.

యాటకల్లు చిన్న అయ్యమ్మ మరియు 04 ఇతరులు ..... రెస్పాండెంట్స్

**రెస్పాండెంట్స్ నెం.1,2,4 మరియు 5 లకు పిటిషన్ సమన్లు**

To

1. శ్రీమతి యాజకల్లు చిన్న అయ్యమ్మ W/O లేట్ వై. సుంకన్న, (Respondent No.1) R/o ఇంటి నెం.2/43, ఎస్. లింగందిన్నె గ్రామం, గోనేగొండ్ల మండలం, కర్నూలు జిల్లా.
2. ఎస్. నూర్ అహ్మద్ S/o లేట్ షేక్ బాబు సాహెబ్ (Respondent No.2) R/o. ఇంటి నెం.79/20, క్రిష్ణా నగర్, కర్నూలు.
3. మల్కిరెడ్డి వెంకటలక్ష్మీ W/o ఎం.వి. లోకేశ్వర్ రెడ్డి (Respondent No.4) R/o. ఇంటి నెం.50-24-5, ఎండోమెంట్ కాలనీ, గుత్తి రోడ్, కర్నూలు.
4. కిరణ్ కుమార్ S/o. రమాదేవి, (Respondent No.5) R/o. జూపాడు గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.

పై తెలిపిన పిటిషనర్/అప్పిలెంట్ వారు రెస్పాండెంట్స్ అయిన మీపైన పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి రెస్పాండెంట్స్ అయిన మీకు చాలా సార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై పిటిషన్కు సంబంధించి వాయిదా లేది: 25-10-2024 ఉదయం 10.30 గంబలకు రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టుకు హాజరు కావలెనని, మీ తరపున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. రెస్పాండెంట్స్ అయిన మీరు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో పిటీషనర్ / అప్పిలెంట్ పరముగా మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

**వాయిదా తేది : 25-10-2024**

**శ్రీ కె.విరుపాక్ష రెడ్డి,**
పెటిషనర్/అప్పిలెంట్ తరపు వకీలు,
ఆదోని-518301.
ఫోన్ :9441054806